ప్రణాళికా బద్ధంగా పోలింగ్‌కు సన్నద్ధం కావాలి

రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అధికారులు

కామారెడ్డి, ఏప్రిల్ 24 : ప్రణాళికా బద్ధంగా పోలింగ్‌కు సన్నద్ధం కావాలని, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు సమాచార స్లిప్పులను నేటి నుంచి పంపిణీ చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు. తుది ఓటరు జాబితా రూపకల్పన, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు తదితర అంశాలపై కీలక సూచనలు చేశారు. ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ఈ నెల 25న తుది ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 29న పోటీలో ఉన్న గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు తుది ఓటరు జాబితాను అందించాలన్నారు. 26న చేపట్టే స్క్రూటినీ నిబంధనలకనుగుణంగా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని గర్గుల్ గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జునబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలకుగాను 264 కేంద్రాలను ప్రారంభించామన్నారు. 14,331 మంది రైతుల నుంచి 89,244 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ.70 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి వసతి అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్, అడ్లూర్ ఎల్లారెడ్డి సీఈవో భైరయ్య అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 24 : జిల్లాలోని ఓటర్లకు నేటి నుంచి మే 8వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటు వేసేందుకు ఓటర్లు ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధి హామీ కార్డు వంటి వాటిలో ఒక దానిని తప్పనిసరిగా తీసుకెళ్లేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని సూచించారు. జనవరి 23 నుంచి ఏప్రిల్ 15 వరకు మూడు నియోజకవర్గాల్లో 6007 మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో 1815, ఎల్లారెడ్డిలో 1798, కామారెడ్డిలో 2394 మంది యువతీ, యువకులు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. 18 నుంచి 19 ఏండ్ల యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, ఖాసీం అలీ, నరేందర్, ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఉత్కంఠభరితంగా కుస్తీపోటీలు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 24 : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీల్లో వరంగల్‌కు చెందిన రమ్య, మహబూబ్‌నగర్‌కు చెందిన బాలమణి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు బాన్సువాడ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. పోటీల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు నగదు బహుమతులను గ్రామ పెద్దలు అందజేశారు.

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మహిళా మల్లయోధులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి, ఏప్రిల్ 24 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ జిల్లా స్థాయి సెలక్షన్స్‌ను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీన సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మహేశ్, ప్రశాంత్, సురేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పదోతరగతి పరీక్షలకు సిద్ధం

- నేటి నుంచి మే 5వ తేదీ వరకు పరీక్షలు
- జిల్లాలో ఇంటర్మీడియెట్‌కు ఆరు, పదో తరగతికి ఐదు సెంటర్లలో పరీక్షల నిర్వహణ
- ఓపెన్ ఇంటర్‌లో 1432, పదో తరగతిలో 927 మంది విద్యార్థులు

కామారెడ్డి, ఏప్రిల్ : 24 : ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు నేటి నుంచి మే 5వ తేదీ వరకు నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారి నీలం లింగం తెలిపారు. పరీక్షా కేంద్రాలను అన్ని సౌకర్యాలతో సిద్ధం చేసినట్లు చెప్పారు.

ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 11 సెంటర్లు ఉండగా ఇంటర్మీడియెట్‌కు ఆరు, పదో తరగతికి ఐదు పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ పరీక్షలకు ఓపెన్ ఇంటర్‌లో 1432, పదో తరగతిలో 927 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా సమయాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఒక కానిస్టేబుల్‌ను నియమించనున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి, ఏప్రిల్ 24 : మండలంలోని చుక్కాపూర్ గ్రామ సమీపం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పాల్వంచ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుకతోపాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

మాచారెడ్డి, ఏప్రిల్ 24 : హనుమాన్ మాలధరిస్తా అంటే ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరవేణి అంజయ్య (58) కొడుకు ప్రవీణ్ ఇటీవల హనుమాన్ మాల ధరించాడు. అంజయ్య కూడా మాల ధరిస్తానని చెప్పడంతో ఇంట్లోవాళ్లు వద్దన్నారు. దీంతో మనస్తాపం చెందిన అంజయ్య మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తన పంట పొలంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం

రాజంపేట్, ఏప్రిల్ 24 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కామారెడ్డి, ఎల్లారెడి నియోజకవర్గాల బీఎల్‌వోలతో తహసీల్దార్ అనిల్‌కుమార్ పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఎన్నికల రోజున పాటించాల్సిన నియమాలపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. మండలంలో మొత్తం పోలింగ్ బూత్‌లు 24, ఓటర్లు 22,028 ఉండగా అందులో పురుషులు 10,584, స్త్రీలు 11,444 ఉన్నారని తహసీల్దార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 24 : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ బావయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 150 మంది డ్రైవర్లు ఉన్నారని, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో జీవనోపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం ఆటో డైవర్లను ఆదుకోవాలని కోరారు. ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు దస్తాగౌడ్, ఉపాధ్యక్షుడు జబ్బార్ ఖాన్, ప్రధాన కార్యదర్శి నారాగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం రాశులు దగ్ధం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 24 : బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామంలో బుధవారం ధాన్యం రాశులు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. గ్రామంలోని మేత్రి శంకర్‌కు చెందిన 14 ఎకరాలు, మారుతి ఎకరం, గైరారం గంగవ్వకు చెందిన రెండు ఎకరాలు మొత్తం 17 ఎకరాల్లో ధాన్యం కాలిపోయినట్లు రైతులు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతోనే ఈ ఘటన జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి వామన్‌రావు
- బిచ్కుందలో ఈజీఎస్ పనులు, నర్సరీల పరిశీలన

పెద్దకొడప్‌గల్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

మూడు రోజులుగా పనిచేసినా మస్టర్లలో లేని కూలీల హాజరు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 24: ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి వామన్‌రావు ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు. మస్టర్లలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. 'ఉపాధి'లో ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యం' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారితోపాటు జిల్లా విజిలెన్స్ అధికారి దత్తాద్రి కలిసి బుధవారం మండల కేంద్రంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులతోపాటు నర్సరీలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్నా.. మూడు రోజులుగా మస్టర్లలో కూలీల హాజరు, సంతకాలు లేవన్నారు. జిల్లా అధికారులు వస్తున్నట్లు సమాచారం ఉన్నా.. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఎంపీడీవో, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కైనట్లు అర్థమవుతున్నదన్నారు. ఇప్పటివరకు 16 మండలాల్లోని 32 గ్రామాలు తనిఖీ చేశామని, ఇంత అధ్వానంగా పనులు ఎక్కడా చేపట్టడం లేదన్నారు. నలుగురు ఉపాధి పని చేస్తే.. వంద మంది టైం పాస్ చేస్తున్నారన్నారు. పనిచేసే ప్రదేశంలోనే కూలీల హాజరు, సంతకాలు తీసుకోవాలని, వారం రోజుల అనంతరం తీసుకొని పనికి రాని కూలీలకు కూడా హాజరు వేస్తున్నారని మండిపడ్డారు. దీంతో పనిచేసిన వారు నష్టపోతున్నారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో కూలీలు కొలతల ప్రకారం పనులు చేయడం లేదని దీంతో రూ.180వరకు నష్టపోతున్నారన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో సూర్యకాంత్, ఏపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అంతా కల్తీ..

- కొంప ముంచుతున్న నిర్లక్ష్యం
- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారగణం
- అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్న ప్రజలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 24: కాదేది కల్తీకి అనర్హం అని నిరూపిస్తున్నారు వ్యాపారులు. ఎక్కడ ఏది కల్తీ చేయొచ్చో అక్కడ అది యథేచ్ఛగా కల్తీ చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ.. లక్షలు గడిస్తున్నారు. ఆహారంలో భాగమైన పాలు, పండ్లు కూడా కాలుష్యంతో నిండిపోతున్నాయి. ఆహార పదార్థాలు కల్తీకాకుండా పాటించాల్సిన నిబంధనలు, ప్రమాణాలు, మార్గదర్శకాలను ప్రభుత్వం జారీచేసింది. అయినా వాటిని అతిక్రమించి వ్యాపారులు ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో వ్యాపారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతున్నది.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో ఆహార పదార్థాలు ఇలా ప్లాస్టిక్ కవర్‌లో ప్యాకింగ్

ప్లాస్టిక్ కవర్‌లో తీసుకువచ్చిన టీని పేపర్‌గ్లాస్‌లో పోస్తున్న వ్యక్తి

రసాయనాలతో పండ్ల ఉత్పత్తి..

ప్రతి పండుని రసాయనాలతో మగ్గించడం మార్కెట్లో సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా బొప్పాయి, మామిడి, అరటి పండ్లు మగ్గడానికి రసాయనాలు వాడుతున్నారు. రసాయనాల వాడకంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. గతంలో కార్బయిడ్ వాడగా.. ప్రస్తుతం దానిస్థానంలో సింథటిక్ రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పంట పండించే సమయంలోనే పురుగులు, తెగుళ్ల నివారణకు మోతాదుకు మించి రసాయనాలను వాడుతున్నారు.

పాలిథిన్ కవర్లలో ఆహారం పార్శిళ్లు..

హోటళ్ల నిర్వాహకులు ఆహార పదార్థాలను పార్శిల్ చేయడానికి పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. వేడి వేడి పదార్థాలను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేస్తున్నారు. దీంతో వేడికి ప్లాస్టిక్ కవర్ల నుంచి విడుదలయ్యే రసాయనాలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. భవిష్యత్తులో పలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వాడిన నూనెనే పదే పదే వాడుతూ..

సాయంకాలం, వానకాలంలో ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా పకోడి, బజ్జీలు తింటుంటారు. కానీ వాటిని తయారు చేయడానికి వాడిన నూనెనే పదే పదే వాడుతున్నారు. పరిమితికి మించి వాడిన నూనెలో వేయించడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయినా అందరూ వాటినే ఇష్టంగా తినడం అంటే అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడమే.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ కాలేజీల్లో తగ్గిన ఉత్తీర్ణత

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ఎల్లారెడ్డి మండలంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపీసీలో 22 మంది పరీక్షలు రాయగా 16మంది, బైపీసీలో 34మందికి 24 మంది ఉత్తీర్ణులైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృతమూర్తి తెలిపారు. 73.21శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాన్నారు. మోడల్‌స్కూల్‌లో 121 మందికి 56మంది ఉత్తీర్ణత సాధించగా.. 46శాతం రిజల్ట్ వచ్చిందని సాయిబాబా తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 21మంది సెకండ్ ఇయర్ పరీక్షలు రాయగా 12మంది పాస్ కాగా 57 శాతం రిజల్ట్ వచ్చిందని ప్రిన్సిపాల్ మసూద్ అలీ తెలిపారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 116మంది పరీక్ష రాయగా 18మంది విద్యార్థులు మాత్రమే పాస్ అయ్యారని, 15.51శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హేమచందర్ తెలిపారు. గిరిజన గురుకుల బాలికల కళాశాలలో 86శాతం ఉత్తీర్ణత సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ తెలిపారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం

గాంధారిలో తిరుగుతున్న బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం రథం

గాంధారి, ఏప్రిల్ 24: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆయా పార్టీల ఆధ్వర్యంలో ప్రచార రథాల ద్వారా గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గాంధారితోపాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి సంబంధించిన ప్రచార రథాలు తిరుగుతున్నాయి. ఆయా పార్టీల మేనిఫెస్టోలోని అంశాలు, చేసే అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు సంబంధించిన ప్రచార రథం మండలంలో జోరుగా ప్రచారం చేస్తున్నది.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

గాంధారి, ఏప్రిల్ 24: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి ఎంపీడీవో రాజేశ్వర్ పూలమాలను వేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ వస్తున్నదని అన్నారు. కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. విధులను సరిగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన పంచాయతీ కార్యదర్శులు

కేక్ కట్ చేస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

రథోత్సవం

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రామారెడ్డిలో బుధవారం రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
– రామారెడ్డి, ఏప్రిల్ 24

నర్సరీల్లోని మొక్కలపై దృష్టిపెట్టాలి

గాంధారి, ఏప్రిల్ 24: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టాలన్నారు. జూన్ నెల వరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.